# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటుకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో విజయోత్సవ సభ నిర్వహిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం.**
2. **గత రెండేళ్లలో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్.**
3. **నెల్లూరు రొట్టెల పండుగ ఏర్పాట్లు ఈ నెల 24వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి పి. నారాయణ.**
4. **రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్న రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి.**

==========================

ప్రతిష్టాత్మక సంగీత నాటక అకాడమీ అవార్డులు అందుకున్న ప్రముఖ కళాకారులను రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అభినందించారు. భారతీయ సాంప్రదాయ కళల పరిరక్షణ, ప్రోత్సాహానికి వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని గవర్నర్ ఈ రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024--25 సంవత్సరానికి గాను సంగీత నాటక అకాడమీ ప్రదానం చేసే 'అకాడమీ రత్న' ఫెలోషిప్ అవార్డును అందుకున్న ప్రముఖ కూచిపూడి గురువు పశుమర్తి రత్తయ్య శర్మను గవర్నర్ అభినందించారు. కూచిపూడి నృత్య కళాభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషికి ఈ అవార్డు దక్కడం గర్వకారణమని అన్నారు. అలాగే, తెలుగు పద్య నాటక రంగానికి చేసిన విశిష్ట సేవలకు గాను నటన విభాగంలో సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్న ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను కూడా గవర్నర్ అభినందించారు.

--------------------------

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవ సభను నిర్వహిస్తోంది. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని దామినేడు వద్ద జరుగుతున్న బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ లతో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

పాల్గొన్నారు. ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి  కె. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

గత రెండేళ్లలో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు వినియోగదారులపై అదనపు భారం పడకుండా చర్యలు తీసుకున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణలపై  సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా  మంత్రి ఈ రోజు స్పందిస్తూ, గత రెండేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచలేదని, రానున్న మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీల పెంపు ఉండదని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడం ద్వారా బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించామని తెలిపారు. సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా 160 గిగావాట్ల లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో  నిర్వహిస్తున్న యోగాంధ్ర--2026 కార్యక్రమాలలో  ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. శ్రీకాకుళంలోని కార్గిల్ పార్క్‌లో నిర్వహించిన ప్రత్యేక యోగా శిబిరంలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలకు చెందిన  200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.  పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద నిర్వహించనున్న రొట్టెల పండుగకు ఈ నెల 24వ తేదీలోపు  అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని  పురపాలక శాఖ మంత్రి  పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు.రొట్టెల పండుగ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మంత్రి నారాయణ సూచించారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధికి  కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని , పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణానికి కేంద్రం మద్దతు కొనసాగుతోందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆమె ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని  అన్నారు, దేశాభివృద్ధి,

ప్రజా సంక్షేమానికి ప్రాధ్యానతనిస్తూ, వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి  పాలన సాగిస్తున్నారని పేర్కొంటూ,

వాయిస్  30సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఈ రోజు నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు తిరిగి బడిబాట పట్టారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 పనిదినాలు, 87 సెలవు దినాలు ఉండనున్నట్లు పేర్కొంది. విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యామిత్ర కిట్ల పంపిణీకి  ఏర్పాట్లు చేశామని  అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా భారతదేశం మహిళా సాధికారతలో గణనీయమైన పురోగతి సాధించిందని  వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 12 ఏళ్ల సంక్షేమంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి ఈ రోజు స్పందిస్తూ, కేవలం మహిళా సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, మహిళలను అభివృద్ధి ప్రక్రియలో ప్రధాన భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. తాగునీటి సౌకర్యాలు, సౌచాలయాలు, పొగ లేని వంటిల్లు, బ్యాంక్ ఖాతాల సదుపాయం వంటి ప్రాథమిక అవసరాల నుంచి పారిశ్రామిక రంగం, రక్షణ, విమానయానం వంటి ఆధునిక రంగాల వరకు మహిళలకు అవకాశాలు విస్తరించాయని   సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నార

---------------------------

ఒమన్ తీరంలో భారతీయులు ప్రయాణిస్తున్న నౌకపై జరిగిన దాడి ఘటనలో విశాఖపట్నానికి చెందిన మెరైన్ ఇంజినీర్ సురేశ్ పట్నాల మృతిచెందడం విషాదకరమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, వారిలో రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఉండటం విచారకరమని అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతిని  తెలియజేశారు.

---------------------------

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక అవగాహనా దినోత్సవం ఈ రోజు  నిర్వహిస్తున్నారు. ప్రపంచ కార్మిక సంస్థ--ఐఎల్ఓ పిలుపు మేరకు 2002వ సంవత్సరం నుండి ప్రతి ఏటా జూన్ 12వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రదేశాలలో బాల కార్మికులను నిర్మూలించడం, బాల కార్మికులను గుర్తించి, వారికి నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించడం, ఎటువంటి పరిస్థితులలోనూ కార్మికులుగా పిల్లలు మారకుండా  చూడడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. “బాల కార్మికత్వంపై 'రెడ్ కార్డ్' -- బాల్యాన్ని కాపాడుదాం, ఉపాధిని గౌరవిద్దాం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

అనంతపురం నగరంలోని జార్జిపేట తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు అందుబాటులోకి తెచ్చామని అనంతపురం డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, మొబైల్ నంబర్ చిరునామా జనన తేదీ బయోమెట్రిక్ వివరాలలో మార్పుల వంటి సేవలు

అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తపాలా కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రంలో ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవలను ఒకేచోట పొందవచ్చని తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

======================